క్లుప్తంగా

సీపీని కలిసిన పోలీస్ అధికారులు

వరంగల్ క్రైం: ఇటీవల వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన బదిలీల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పర్వతగిరి సీఐ బి.రాజగోపాల్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వి.చేరాలు, లింగాలఘణపూర్ ఎస్సై బి.శ్రావణ్‌కుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పూలమొక్క అందజేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

తరిగొప్పుల: అంకుషాపూర్ గ్రామానికి చెందిన జీడికంటి లలిత ఐదు నెలల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి పోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం లలితకు అప్పగించినట్లు ఎస్సై అయ్యాల శ్వేత తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జనగామ రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఏఆర్ కానిస్టేబుల్ పిలుపునిచ్చారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు కోసం తాను 38వ సారి రక్తదానం చేయడం జరిగిందన్నారు. అలాగే తమ్ముడి శ్రీకాంత్ 2వ సారి రక్తదానం చేశారు. అలేరు ఎస్‌సీఆర్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ శంకర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా పట్టణానికి చెందిన జోగు భాస్కర్ 7వ సారి రక్తదానం చేశారు.

వ్యక్తి అదృశ్యం


బుజ్జి

చిల్పూరు: మండలంలోని దేశాయితండాగ్రామానికి చెందిన భూక్య బుజ్జి (55) అదృశ్యమవడంతో బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బుజ్జి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై పొలం పనులకు వెళ్లక పోవడంతో మంగళవారం భార్య కాంతి మందిలించింది. దీంతో పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో బుధవారం సాయంత్రం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాదాస్పద భూమిలో రెవెన్యూ అధికారుల సర్వే

చిల్పూరు: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన సీలింగ్ భూములను బుధవారం చిల్పూరు రెవెన్యూ అధికారి కల్వల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వేయర్ సర్వే చేపట్టారు. కాగా, వచ్చే సోమవారం వరకు పూర్తి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేయన్నుట్లు సర్వేయర్ నరేష్‌నాయక్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రంగు రమేశ్‌గౌడ్, కొయ్యడ రాందాసు, కేశిరెడ్డి కర్ణాకర్‌రెడ్డి, పానుగంటి పోషయ్య, నీల చినవెంకటయ్య ఉన్నారు.

బయోమెట్రిక్ విధానంతోనే ఎరువులు విక్రయించాలి

నర్మెట: బయోమెట్రిక్ విధానంతోనే ఎరువుల బస్తాలను విక్రయించాలని, అధికధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి ధరావత్ సంతోషి అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపులను బుధవారం పరిశీలించిన ఆమె రికార్డులను, నిల్వలను, బయోమెట్రిక్ పరికరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులకు రశీదులను తప్పక తీసుకోవాలని అన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

కొడకండ్ల: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం మండలంలోని రామవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు కునూరు ఐలయ్య(43) రోజుమాదిరిగా కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి చెట్టు పైనుంచి కిందపడిపోయాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన పుల్యాల సురేష్‌రెడ్డి (35) పిల్లలు కలగడం లేదనే మనస్తాపంతో క్రిమిసంహారక మందు తాగి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన పుల్యాల సురేష్‌రెడ్డికి ఇదే మండలం చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన సుస్మితతో వివాహం జరిగింది. కాగా, పిల్లలు కలగడం లేదని ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో ఐదు రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. రెండు రోజుల తర్వాత విషయాన్ని బంధువులకు తెలిపాడు. వెంటనే వారు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి

దేవరుప్పుల/కొడకండ్ల/తరిగొప్పుల/పాలకుర్తి/నర్మెట/లింగాలఘణపురం/జఫర్‌గఢ్: పలు మండలాల్లోని సంక్షేమ వసతి గృహాలను బుధవారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని పరిసరాలు, వంటశాల, గదులు, మరుగుదొడ్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లోని నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి కోసం సంక్షేమ అధికారి, సిబ్బంది అంకిత భావంతో తోడ్పాటు అందించాలని సూచించారు. అలాగే విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో నెలకొన్న అపరిష్కృత సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. తనిఖీలో తహసీల్దార్లు హుస్సేన్, కోల చంద్రమోహన్, ఎం.నాగేశ్వరచారి, ఎం. మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, శంకరయ్య, ఎంపీడీఓలు అరవింద్ చౌహాన్, రాములు, దేవేందర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ సాయిబాబ, ఆర్‌ఐలు రాజు, శ్రీనివాస్, రాకేష్, ఎంపీఓ ఇందిర, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


దేవరుప్పుల: హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ హుస్సేన్


కొడకండ్ల: మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రమోహన్


తరిగొప్పుల: కేజీబీవీలో వండిన అన్నంను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగేశ్వరచారి


పాలకుర్తిలో కిచెన్ స్టోర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాములు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నర్మెట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్సై సైనాల నగేష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడకంలో జాగ్రత్తలు వహించాలని, అపరిచితులకు బ్యాంకు ఖాతా, ఓటీపీలు, పిన్ నంబర్ తదితర వివరాలను తెలియపరచవద్దని, సోషల్‌మీడియాలోని అనవసర సమాచారంపై స్పందించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ వేణు, పీసీలు కంగెర్ల రమేష్, కాస రాజు రాజు, ప్రజలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసకావద్దు

జనగామ రూరల్: యువత మత్తు పదార్థాలకు బానిసకావద్దని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సెంధ్యారాణి అన్నారు. బుధవారం నిశా ముక్త్ అభియాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహ కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిషేధిత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు అధ్యాపకులు, ఎస్సీ సంక్షేమాధిశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి

బచ్చన్నపేట: పద్మశాలీలు సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ నరేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలు కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తూ కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక బరిలో ఉన్న రిటైర్డ్ టీచర్ బూర మల్లేశానికి మద్దతు తెలుపుతూ ఆయన రాట్నం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

ఇళ్లపై రెపరెపలాడిన జాతీయ జెండాలు


ఇంటిపై జెండా ఎగరేస్తున్న బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హరిశ్చంద్రగుప్త


వీవర్స్ కాలనీలో జెండాను ఎగరేస్తున్న నేత కార్మికుడు కృష్ణ


కొడకండ్ల: జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

జనగామ: పంద్రాస్టు వేడుకలను పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు జిల్లాలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడుతోంది. అన్ని వర్గాల ప్రజలు బుధవారం జెండాను ఇంటిపై ఎగరేసి సెల్యూట్ చేశారు.

జాతీయ జెండాల పంపిణీ

కొడకండ్ల: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బుధవారం మండలకేంద్రంలో జాతీయ జెండాలను పంపిణీ చేసినట్లు బీజేపీ నాయకులు కోటేశ్వర్‌రావు, మోడపల్లి సోమన్న తెలిపారు. స్వాతంత్ర్య వజ్రోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముంజాల శ్రీనివాస్‌గౌడ్, ఉప్పల మహేష్, ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'హర్‌ఘర్ తిరంగా' ర్యాలీ

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గోనె అమరేందర్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కంకణం కడుతున్న అర్చకుడు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని సముద్రాల గ్రామంలో ధర్మకర్త, ఆలయనిర్మాణకర్త కందూరు సోమిరెడ్డి, నాగమణి సహకారంతో చేపడుతున్న మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మహంకాళి ఆలయం పునర్నిర్మాణం చేయడం శుభప్రదమని, ఈ మేరకు నిర్మాణకర్తలను అభినందించారు. ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, లలితాదేవి, బెలిదె వెంకన్న, గుండె నర్సయ్య, తాటికొండ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కడియం ఆగ్రహం

మండలంలోని సముద్రాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరైన విషయ పరిజ్ఞానం లేకపోవడంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అక్కడ ఉన్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సముద్రాల జెడ్పీఎస్‌ఎస్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పాఠశాలలో సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల సమస్యలు తదితర అంశాలను పరిశీలించారు.

కూరగాయల మార్కెట్‌కు స్థల పరిశీలన

ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం స్థానిక రైల్వే ఫ్లై ఓవర్ కింద సర్వే నంబర్ 627లోని ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే కడియం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనంబర్ 627లో ప్రభుత్వ భూమి మూడు ఎకరాలు ఉంటుందని, ఇందుకు సంబంధించిన హద్దులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఆర్‌ఐ రవీందర్, సర్వేయర్ నరేష్, ఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను రెన్యూవల్ చేయాలి

జనగామ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించి, రెన్యూవల్ చేయాలని అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా నాయకు డు కె.యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు. అధ్యాపకులు రణధీర్, శ్రీనివాస్, శ్రీనాథ్, సభిత, మమత, వసంత పాల్గొన్నారు.

గీతకార్మికుల చైతన్య యాత్ర

చిల్పూరు: మండలంలో అమరుల యాదిలో గీతకార్మికుల చైతన్య యాత్రను బుధవారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య ప్రారంభించారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట రేణుకాఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రమేశ్, రాజన్న, వెంకటేశ్, మహేందర్, ప్రవీణ్, విజయ భాస్కర్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

తరిగొప్పుల: సీజనల్ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండలకేంద్రంలోని కమ్మరిపేటలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న వారి కుటుంబసభ్యుల రక్త నమూనాలు సేకరించి టెస్టుల నిమిత్తం ల్యాబ్‌కు పంపిచారు. అనంతరం దోమల బెడదను నివారించేందుకు దోమలు ఆవాసముండే ప్రదేశాల్లో టెమోఫాస్ మందును పిచికారీ చేశారు. హెల్త్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, పద్మావతి, వేణు వసంతరాణి, భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్లు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా అంబేడ్కర్ సెంటర్



స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపాన అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా ఉంది. శివునిపల్లి నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్, పాంనూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు సర్కిల్ వద్ద గుంతలమయంగా మారింది. బీటీ రోడ్డు ప్రమాదకరంగా గుంతలతో ఉండగా ఇటీవల తూతూమంత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేయగా తేలికపాటి వర్షాలకే కొట్టుకుపోయి మళ్లీ మొదటికి వచ్చింది. ఈ రోడ్డు విషయమై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - స్టేషన్‌ఘన్‌పూర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : తిరునగరి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 8374516716

వైభవంగా బోనాలు

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/పాలకుర్తి టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని సముద్రాలలో ముదిరాజ్‌ల కులదైవమైన పెద్దమ్మతల్లి బోనాల పండుగను బుధవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దమ్మతల్లి గుడికి వెళ్లి బోనాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే జఫర్‌గఢ్ మండలంలోని పాతూరు, పాలకుర్తిలో మహిళలు ఊరేగింపుగా వెళ్లి పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

శివాలయానికి వెండి విఘ్నేశ్వర విగ్రహం అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొలిపాక సతీష్, సునీత దంపతులు స్థానిక స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయ పూజారి రామలింగయ్యశర్మకు రూ.15వేలు విలువైన వెండి విఘ్నేశ్వర విగ్రహాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కొలిపాక ఈశ్వర్‌ప్రసాద్ తదితర భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల..

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లుట్ల ప్రీతం సహకారంతో బుధవారం బీజేవైఎం రాష్ట్ర నాయకుడు శానబోయిన మహిపాల్ విద్యార్థులకు టై, బెల్టులు బుధవారం అందజేశారు. హెచ్‌ఎం రాజేందర్, రవీందర్‌రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక స్థితిగతులతోనే ఉన్నత విద్య

దేవరుప్పుల: విద్యార్థులు శారీరక, మానసిక, సామాజిక అంశాల స్థితిగతులతోనే ఉన్నత విద్యలో రాణిస్తారని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ భాష్యం రఘు సూచించారు. బుధవారం మండలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆబాద్ జనగామ సౌజన్యంతో దాస సూర్యకల జ్ఞాపకార్థం కుమారులు నర్సయ్య, ఉపేందర్ విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి అంజయ్య, క్లబ్ జిల్లా చైర్మన్ అల్లాడి ప్రభాకర్, కార్యదర్శి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

సంతాపం

రఘునాథపల్లి: మండలంలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడూరి సంపత్‌రెడ్డి, వెంకటపాపిరెడ్డిల తండ్రి మాధవరెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

గానుగుపహాడ్‌లో..

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం సిద్దిరాములు, ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన పుట్టపాక మహేందర్ మృతి చెందారు. కాగా, బుధవారం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక మహేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మెట్టు మల్లారెడ్డి, చిన్నమడూరులో అనగాని సోమశేఖర్ మృతి చెందారు. ఇద్దరి మృతదేహాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన అక్కనపెల్లి వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, మాజీ వైఎస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

ఈరవెన్నులో..



పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామంలో మేర ప్రమీల బుధవారం మృతి చెందింది. కాగా అంత్యక్రియల నిమిత్తం ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.3వేల సాయం బుధవారం అందజేశారు. సంస్థ ప్రతినిధులు బిర్రు సోమేశ్వర్, ఏదునూరి మదార్, ముసుకు కేశవరావు, అనుముల మహేందర్, అనంతుల పురుషోత్తం, యార రాజు, తోడుసు మల్లేశం, బిర్రు వెంకటేశ్వర్లు, జక్కుల రాజు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ టీచర్లు అందించాలని మండలంలోని కొడవటూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీకేంద్రాలను తనిఖీ చేశారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నమడూరులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును లబ్ధిదారు రేణుకకు అందజేశారు.

వాహనాల బైండోవర్

బచ్చన్నపేట: పోచన్నపేట శివారులోని అప్పన్న కుంట నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలించే ప్రయత్నం చేస్తున్న పలు వాహనాలను పట్టుకుని తహసీల్దార్ ముందు బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను బైండోవర్ చేయగా రూ.లక్ష సొంత పూచీకతుపై విడుదల చేశారని అన్నారు. బైండోవర్‌లో జేసీబీ డ్రైవర్ సులేమాన్ అనస్థలి, ట్రాక్టర్ల డ్రైవర్లు గుజ్జుక నవీన్, గజ్జెల్లి శేఖర్ ఉన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాక్టర్ల బ్యాటరీల చోరీ

బచ్చన్నపేట: వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాక్టర్ల నుంచి దుండగులు బ్యాటరీలను చోరీ చేసిన సంఘటన మండలంలోని బండనాగారంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొల్ల నర్సిరెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ బావుల వద్ద ట్రాక్టర్లను రోజూ మాదిరిగా నిలిపివేశారు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్లలో బ్యాటరీలు మాయమయ్యాయి. దీంతో విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

భోజన ప్లేట్ల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ నివాసి, పాఠశాల పూర్వ విద్యార్థి అయిత ఉపేందర్ తల్లి ప్రమీల జ్ఞాపకార్థం ఉచితంగా మధ్యాహ్న భోజన ప్లేట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాద శ్రీనివాస్, దాతలు ఐత ఉపేందర్, పద్మ, ఐత వెంకటయ్య పాల్గొన్నారు.